# ఒకటో తరగతిలో చేరడానికి ఐదేళ్లా, ఆరేళ్లా?

**స్పష్టత ఇవ్వని రాష్ట్ర సర్కార్.. కేంద్ర స్కూళ్లలో 6 సంవత్సరాల విధానం అమలు**

**రెండేళ్లుగా అమలు చేస్తున్న సిబిఎస్ఇ, ఐసిఎస్ఇ, కెవి స్కూల్స్**

**భవిష్యత్‌లో ఎక్కువగా నష్టపోయేది ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారే**

**హైదరాబాద్, జనవరి 24, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా 1వ తరగతిలో చేరడానికి 6 సంవత్సరాలు ఉండాలని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రెండేళ్ల కేంద్ర ప్రభుత్వ అధీనంలోని స్కూల్స్‌లో దీనిని అమలు చేస్తున్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో మాత్రం గత రెండేళ్లుగా దీనిపై నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటి వరకు కూడా రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్‌లో 1వ తరగతిలో చేరడానికి 5 సంవత్సరాలు నిండి ఉండాలి. అదే నిబంధనను కొనసాగిస్తోంది. గత కొన్ని శతాబ్దాలుగా ఇదే విధానం కొనాసగుతుండటంతో.. అదే పద్ధతిని రాష్ట్రంలో ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితమే 1వ తరగతిలో చేరడానికి 6 సంవత్సరాలు నిండాలని నిబంధన పెట్టింది. దానిని కేంద్ర ప్రభుత్వ అధీనంలోని స్కూల్స్‌లో అమలు చేస్తున్నారు. 2024-25, 2025-26 విద్యా సంవత్సరాల్లోని కేంద్ర విద్యా శాఖ పరిధిలోని అన్ని స్కూల్స్‌లోనూ ఇదే అమలు చేస్తున్నారు. కేంద్రం 1వ తరగతిలో చేరడానికి 6 సంవత్సరాలని నిర్ణయించడంతో కేంద్రీయ విద్యాలయాల్లో 1వ తరగతిలో ప్రవేశాల కోసం 6 సంవత్సరాలు నిండి ఉండాలని పేర్కొంటూ గతంలో ఉన్న 5 సంవత్సరాల నిబంధనను మార్చి అడ్మిషన్లను తీసుకుంటున్నారు.

కానీ రాష్ట్రంలోని ఎస్ఎస్‌సి సిలబస్‌తో కొనసాగుతున్న ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్‌లో మాత్రం 1వ తరగతిలో చేరడానికి 5 సంవత్సరాల నిబంధననే కొనసాగిస్తున్నారు. కానీ రాష్ట్రంలో కొనసాగుతున్న సిబిఎస్ఈ, ఐసిఎస్ఈ, కేంద్రీయ విద్యాలయాలు మాత్రం 6 సంవత్సరాలు నిండిన వారిని మాత్రమే 1వ తరగతిలో చేర్పించుకుంటున్నారు. సిబిఎస్‌సి, ఐసిఎస్ఈ, కేంద్రీయ విద్యాలయాల్లో చేర్పిస్తున్న తల్లిదండ్రులు తమ పిల్లలను గత రెండేళ్లుగా ఒకే తరగతిలో రెండేళ్ల చదివించాల్సి వస్తుంది. అందుకు కారణం 1వ తరగతిలో చేరడానికి 6 సంవత్సరాల నిబంధనే. సాధారణంగా 3వ సంవత్సరంలోనే పాఠశాలలకు పంపించడంతో ఎల్‌కెజీ ఆ తరువాత 4వ సంవత్సరంలో యుకెజి పూర్తి చేస్తారు. దీంతో 5వ సంవత్సరంలో 1వ తరగతిలో చేర్పించే వారు. కానీ ఇపుడు 6 సంవత్సరాలకి 1వ తరగతిలో చేర్పించాలి కాబట్టి మరోసారి యుకెజిని చదివిస్తున్న పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలోని ఎస్ఎస్‌సి సిలబస్‌తో కొనసాగుతున్న స్కూల్స్‌లో మాత్రం అలా కాకుండా 3వ సంవత్సరంలో ఎల్‌కెజి, 4వ సంవత్సరంలో యుకెజి పూర్తికాగానే 5వ సంవత్సరంలో 1వ తరగతిలో చేర్పిస్తున్నారు. ఇప్పటి ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ రాబోయే రోజుల్లో ఇంటర్మీడియట్ తరువాత నీట్ పరీక్ష, అలాగే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు అటెండ్ కావాలన్నా, భవిష్యత్తులో యూపిఎస్‌సి నిర్వహించే సివిల్స్ పరీక్షలకు హాజరు కావాలన్నా మినిమమ్ ఏజ్ విషయంలో ఒక ఏడాదిపాటు ఎదురు చూడాల్సి ఉంటుంది. ప్రస్తుతం నీట్, జేఈఈ అడ్వాన్స్‌డ్‌కి మినిమమ్ వయస్సు 18 సంవత్సరాలు ఉంది. ఇప్పటికిప్పుడు నష్టం జరగకపోయినప్పటికీ.. భవిష్యత్తులో ఇటువంటి అవకాశం ఏర్పడనుంది. అందుకు కారణం కేంద్రం తీసుకున్న 6 సంవత్సరాల నిర్ణయాన్ని ఇప్పటికే సిబిఎస్ఈ, ఐసిఎస్ఈ, కేంద్రీయ విద్యాలయాలు అమలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీరు ఇంటర్మీడియట్ ముగిసే సరికి నీట్, జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలకు హాజరయ్యే నాటికి వారికి అనుకూలంగానే కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది. అందుకు కారణం వారు ఎక్కువ సంఖ్యలో ఉంటారు కాబట్టి. అప్పుడు మన రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్‌లో ఎస్ఎస్‌సి సిలబస్‌తో చదివిన విద్యార్థులు వారు నిర్ణయించే మినిమమ్ వయస్సు కంటే ఒక ఏడాది చిన్నగా ఉంటారు కాబట్టి.. ఏడాదిపాటు సంబంధిత పోటీ పరీక్షలకు హాజరు కావడానికి ఎదురు చూడాల్సి వస్తుంది.

గత 10 సంవత్సరాలుగా రాష్ట్రంలో జననాల సంఖ్య సుమారు 5 లక్షల వరకు ఉంటుంది. ఈ 5 లక్షల జననాల్లో పాఠశాలల్లో చేరే వారిలో ప్రైవేటు పాఠశాలల్లో చేరే వారు సుమారు 3.50 లక్షలకి పైగా ఉంటుండగా.. ప్రభుత్వ స్కూల్స్‌లో సుమారు 1.30 లక్షల నుంచి 1.50 లక్షల చేరుతున్నారు. ఇదే రేషియాగా వారు 10వ తరగతి వరకు వచ్చేసరికి ప్రతి ఏడాది సుమారు 5 లక్షల వరకు పరీక్షలకు హాజరవుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ముందుగానే ఎల్‌కేజీ నుంచే చేరుతున్నందున వారు అలాగే 1వ తరగతిలో చేరిపోతారు. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో అలా కాకుండా నేరుగా 1వ తరగతిలో చేరుతున్నారు.

కాబట్టి ఇక్కడ వారికి ముందుగా నేర్పించాల్సిన విద్యాబుద్ధులు లేకుండానే నేరుగా 1వ తరగతిలో చేరుతారు. అయితే ఇప్పటి వరకు ఉన్న విధానం మూలంగానే ప్రస్తుతం 5 సంవత్సరాలు నిండిన వారిని 1వ తరగతిలో చేర్చుకుంటున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో సిబిఎస్ఈ, ఐసిఎస్ఈ, కేవిల్లో 6 సంవత్సరాలకు చేర్చుకుంటున్నారు. కేంద్రం గత రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వాన్ని 6 సంవత్సరాల అంశంపై అడుగుతూనే ఉంది. కానీ గత రెండేళ్లుగా ఈ అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విద్యా విధానం(టిఈపి)ని రూపొందించడం కోసం ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ ఇచ్చే నివేదికలో ఈ అంశంపై కూడా ప్రతిపాదనలు ఉంటాయని విద్యాశాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఆ కమిటీ నివేదిక 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభం కంటే ముందుగానే ఇస్తారా? దీనిపై రాబోయే 2026-27 విద్యా సంవత్సరంలోనే నిర్ణయం తీసుకుంటారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## మూడు మండలాల్లోని చెరువులకు మహర్దశ

**అధికారులతో సమీక్షించిన మంత్రి దామోదర రాజనర్సింహ**



**అల్లాదుర్గం, జనవరి 24, ప్రభాతవార్త:** ఆందోల్ నియోజకవర్గంలోని అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్ మండలాల్లోని చెరువులకు మహర్దశ పట్టనుంది. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిని మంత్రి దామోదర్ రాజనర్సింహా నివాసంలో అధికారులతో కలిసి చెరువులు, కుంట కట్టల మరమ్మత్తులు, ఫీడర్ కెనాల్ పునరుద్ధరణ పనులు, ఒట కాల్వల నిర్మాణం, పునరుద్ధరీకణ పనులపై ఇరిగేషన్ శాఖ అధికారులతో మంత్రి దామోదర్ రాజనర్సింహా సమీక్షించారు. అల్లాదుర్గం మండలంలో ఉన్న 132, టేక్మాల్ మండలంలోని 135, రేగోడ్ మండలంలోని 91 ,ఉరువులు, కుంటలు, ఫీడర్ కెనాల్స్, ఒట కాల్వల మరమ్మత్తుల కోసం బడ్జెట్ అంచనా ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. అల్లాదుర్గంలోని చెరువులు, కుంట కింద 5778 ఎకరాల్లోసాగు అవుతున్న ఆయకట్టు, టేక్మాల్ మండలంలోని 5802 ఎకరాల్లో, రేగోడ్ మండలంలోని 4011 ఎకరాల్లో సాగవుతున్న ఆయకట్టులకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందించడంతో పాటు దనవు ఆయకట్టును పెంచుకోవడానికి చెరువుల మరమ్మత్తు పనులు ఈ సీజన్‌లోనే పూర్తయ్యేలా అవసరమైన కార్యచరణను రూపొందించాలని అధికారులను సూచించారు. టేక్మాల్ మండలంలోని చిన్న చెరువు, పెద్ద చెరువు, అల్లాదుర్గంలోని పటేల్ చెరువు, అల్లాదుర్గం చెరువు, బొల్లు చెరువు, గడి పెద్దాపూర్ చెరువు, అప్పాజీపల్లి గిద్దమ్మ చెరువు, రామ్‌పూర్ చెరువు, ముప్పారం చెరువు, నల్లకుంట చెరువుల కట్టల మరమ్మత్తులతో పాటు ఫీడర్ చెనాల్, ఒంట కాల్వల నిర్మాణం, పునరుద్ధరీకరణ పనులపై మంత్రి చర్చించారు. రేగోడ్ మండలంలోని రేగోడ్ పెద్ద చెరువు, గజ్వాడ, కామోల్లి, కొత్వాల్ పల్లి పెద్ద చెరువులు, చెరువు కట్టల మరమ్మత్తు, ఫీడర్ కెనాల్, ఒట కాల్వల పనుల పునరుద్ధరణ పనులపై మంత్రి అధికారులతో సమీక్షించారు. సమీక్ష సమావేశంలో ఇరిగేషన్ శాఖ ఈఈ రవీంద్ర, డిప్యూటీ ఈఈ సుబ్బలక్ష్మి, ఏఈలు పాల్గొన్నారు.

## రూ.1,000 కోట్ల రుణానికి గ్రీన్‌సిగ్నల్

**మున్సిపల్ శాఖ కార్యదర్శి టి.కె.శ్రీదేవి ఉత్తర్వులు జారీ**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి24:** మున్సిపల్ కార్పొరేషన్స్, మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల ప్రాజెక్టులు చేపట్టడానికి హౌసింగ్ అండ్ అర్బన్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(హడ్కో) నుంచి రూ.1000 కోట్ల రుణం తీసుకోవడానికి తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ టియుఎఫ్ఐడిసి)కి అనుమతిస్తూ మున్సిపల్ కార్యదర్శి డాక్టర్ టి.కె.శ్రీదేవి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ప్రాజెక్టులు,అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ప్రాజెక్టులు, మురుగునీటి ప్రాజెక్టులు,ఇతర ప్రాజెక్టుల కోసం రూ.7వేల కోట్ల రుణాలు తీసుకోవడానికి టియుఎఫ్ఐడిసికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. రుణం రీపేమెంట్ చేయడానికి వడ్డీతో కూడిన నిధులను ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించనున్నది.

## మేడారంలో రూ.50 కోట్లతో స్నానఘట్టాలు, 348 బ్యాటరీ ట్యాప్స్ ఏర్పాటు

**నిరంతర విద్యుత్ సరఫరాకు 96 ట్రాన్స్‌ఫార్మర్లు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి24:** మేడారం మహా జాతర ప్రారంభానికి మరో మూడు రోజులు మాత్రమే ఉండడంతో జాతరకు హాజరయ్యే దాదాపు కోటిన్నర మంది భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు కలుగ కుండా రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లను చేసింది. ఈనెల 28 ప్రారంభమయ్యే జాతరకు హాజరయ్యే భక్తులు జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించేందుకు నీటిపారుదల శాఖ గత జాతరలకన్నా అదనపు ఏర్పాట్లను చేసింది. ప్రధానంగా రెడ్డిగూడెం నుండి జంపన్న వాగు మీదుగా చిలకలగుట్ట వరకు నీటి మట్టాన్ని కొనసాగించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. జంపన్న వాగులో ఉన్న 29 ఇంఫిల్ట్రేషన్ వెల్స్‌ల పూడికను చేపట్టింది. స్నాన ఘట్టాలపై ఉన్న బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ (బిఓటి) లను పునరుద్ధరించడంతోపాటు బ్యాటరీ ఆఫ్ ట్యాప్ లకు నిరంతర నీటిని అందించేందుకు ఇంఫిల్టరేషన్ వెల్స్ లో సబ్మెర్సిబుల్ పంపులను ఏరాటు చేసి పైప్ లైన్లను నీటిపారుదల శాఖ చేపట్టింది. నీటిపారుదల శాఖ ద్వారా దాదాపు రూ. 50 కోట్ల నిధులతో భక్తులకు ఏర్పాట్లు చేశారు.జంపన్న వాగు పొడుగునా 348 బ్యాటరీ ఆఫ్ ట్యాప్‌లను, 119 డ్రస్ చెంగింగ్ రూమ్‌లను, జంపన్న వాగులో నీటి మట్టాన్ని ఒకే తీరుగా ఉంచేందుకు 9 క్రాస్ బండ్ లను నిర్మించారు. వీటితోపాటు, జంపన్న ఘాట్ లపై ఉన్న మెట్ల మరమత్తులు, జంపన్న వాగులో జలాలు కలుషితం కాకుండా నిరంతరం క్లోరినేషన్ చేపడుతున్నారు.తాడ్వాయి మండలంలో దట్టమైన అడవిలో జరిగే ఈ మేడారం జాతర సందర్బంగా అటవీ సంరక్షణ తోపాటుగా పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర అటవీ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రధానంగా, అటవీ సంపద ధ్వంసం కాకుండా ఉండేందుకు, అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాణాల నివారణ, దట్టమైన అడవుల గుండా వాహనాల రాకపోకల వేగాన్ని నియంత్రించడం లాంటి పనులను అటవీ శాఖ చేపట్టింది.

## మార్చికల్లా లక్ష ఇందిరమ్మ ఇళ్ల పూర్తికి చర్యలు

**డబుల్‌బెడ్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయండి**

**ఇంజినీర్లతో హౌసింగ్ కార్పొరేషన్ ఎండి వి.పి.గౌతం**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 24:** రాష్ట్రంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పనులు మరింత విస్తృతంగా జరిగేలా చూడాలని, ఇల్లు మంజూరైన ప్రతి లబ్దిదారుడు పనులను ప్రారంభించేలా అన్ని రకాలుగా ప్రయత్నించాలని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి. గౌతం అధికారులను ఆదేశించారు. ఆయా నియోజకవర్గాల్లో పథకం పురోగతిని స్థానిక ఎమ్మెల్యేలకు వివరించాలని, ఇండ్లను పూర్తి చేయడంలో ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలను తీసుకోవాలని ఉద్బోధించారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో శనివారం జిల్లా ప్రాజెక్టు డైరక్టర్లు, డిప్యూటీ ఇంజనీర్లతో సమీక్షా సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఇండ్ల నిర్మాణాల పురోగతిని బట్టి చూస్తే మార్చి కల్లా లక్ష ఇండ్లను పూర్తి చేయగలమన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ, ఇదే స్ఫూర్తితో మంజూరైన అన్ని ఇండ్లను పూర్తి చేయాలన్నారు.

## మహిళా ప్రీమియర్‌లీగ్‌లో ఆర్సీబి తొలి ఓటమి

**ఏడు వికెట్ల తేడాతో ఢిల్లీ కేపిటల్స్ విజయం**



**వదోదర, జనవరి 24:** మహిళల ప్రీమియర్‌లీగ్‌లో భాగంగా శనివారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మహిళా జట్టుకు తొలి ఓటమి ఎదురయింది. ఢిల్లీకేపిటల్స్‌లో జరిగిన మ్యాచ్‌లో ఏడు వికెట్ల తేడాతో ఆర్సీబీ ఓటమి చవిచూసింది. తొలుత బ్యాటింగ్‌చేపట్టిన ఆర్సీబీ 20 ఓవర్లలో 109 పరుగులుచేసింది. తదనంతరం లక్ష్య ఛేదనలో 110 పరుగుల మైలురాయిని ఢిల్లీకేపిటల్స్ సాధించేంతవరకూ చెలరేగి ఆడింది. మూడు వికెట్ల నష్టంతో 111 పరుగులు సాధించి విజయం సొంతంచేసుకుంది. నిర్ణీత ఓవర్లలో 26 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. లార్వా వాల్వార్డ్ 42 పరుగులు, జెమీమా రోడ్రిగ్స్ 24, కాప్ 19, షెఫాలివర్మ 16, లిజెల్లీ ఆరు పరుగులుచేసారు. బెంగళూరు బౌలర్లలో సయాలీ రెండు వికెట్లు రాధాయాదవ్ ఒక వికెట్‌తీసారు. ఈ సీజన్‌లో ఇప్పటికే ప్లే ఆఫ్స్‌కు చేరిన ఆర్సీబీకి ఇది తొలి ఓటమి కావడం గమనార్హం. కాగా ఈమ్యాచ్‌లో గత మ్యాచ్‌లో జరిగిన పరాభవానికి ఢిల్లీ బౌలర్లు చెక్‌పెట్టారు. చెన్లెప హెన్రీ 22 పరుగులకు రెండు వికెట్లు, మారినే కాప్ 17 పరుగులకు రెండు వికెట్లు తీసి తమ పంజా విసిరారు. 110 పరుగుల స్వల్పఛేదనలో లారా వొల్వార్డ్ 42, జెమీ మారోడ్రిగ్స్ 24 పరుగులతోకూల్‌గా ఆడి ఢిల్లీ జట్టుకు విజయం తెచ్చిపెట్టారు. మారినేకాప్ బౌండరీతో మ్యాచ్‌ను ముగించగా ఆరు పాయింట్లతో ఢిల్లీ రెండోస్థానానికి ఎగబాకింది.

## రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

**సాధారణం కంటే మించి నమోదు**

**అత్యధికంగా 19 డిగ్రీలు దాటిన ఖమ్మం**

**హైదరాబాద్, జనవరి 23, ప్రభాతవార్త :** రాష్ట్రంలో చలి గాలుల తీవ్రత తగ్గింది. గడిచిన 48 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వివరాల ప్రకారం చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే రెండు నుంచి ఐదు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగాయి. చాలా చోట్ల సాధారణం కంటే 2 నుంచి 5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని ఆదిలాబాద్, కామారెడ్డి, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో 11 నుంచి 15 డిగ్రీలు, మిగతా జిల్లాల్లో 15 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాష్ట్రంలో అత్యధికంగా సూర్యాపేట్ జిల్లాలో సాధారణం కంటే మించి 19.5 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత ఏడాది ఇదే సమయానికి 15.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండగా, ఈసారి అంతకంటే నాలుగు డిగ్రీలు పెరిగాయి.

అలాగే ఖమ్మం జిల్లాలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మించి 19.3 డిగ్రీలుగా రికార్డయినట్లు తెలంగాణ ప్లానింగ్ సొసైటీ వెల్లడించింది. 19.1 డిగ్రీలతో కొత్తగూడెం జిల్లా ఉష్ణోగ్రతలు అత్యధికంగా పెరిగిన జిల్లాగా మూడో స్థానంలో ఉంది. రాష్ట్రంలోనే అతి తక్కువగా ఆసిఫాబాద్ జిల్లాలో 13.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఫిబ్రవరి మొదటి వారంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 23 డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా కొద్ది రోజులుగా తెలంగాణ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయని వాతా వరణ శాస్త్రవేత శ్రీనివాసరావు తెలిపారు. చాలా చోట్ల సాధారణం కంటే 2 నుంచి 5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో శీతలగాలుల పరిస్థితి తగ్గిందన్నారు. ముఖ్యంగా రెండు రోజులుగా ఉష్ణోగ్రతల్లో గణనీయమైన పెరిగాయని చోటు చేసుకుందని తెలిపారు. ఈశాన్య మరియు ఉత్తర దిశ నుంచి తూర్పు, ఆగ్నేయ దిశకు గాలులు వీయటమే ఈ మార్పునకు కారణమని వెల్లడించారు.

రాత్రి ఉష్ణోగ్రతలు 4 నుంచి 5 డిగ్రీలు పెరిగాయని, మిగిలిన వారంలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలో ఉండే అవకాశం ఉందని చెప్పారు. రానున్న 34 రోజుల్లో హైదరాబాద్ నగరంలో ఉష్ణోగ్రతల్లో కూడా మార్పులుండే అవకాశాలు ఉన్నాయని పేర్కొ న్నారు. రాష్ట్రంలో పొడి వాతావరణంతో క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

## మున్సిపల్ ఎన్నికల కోసం ఇన్‌చార్జిలను నియమించిన కెటిఆర్

**కార్పొరేషన్లు, మున్సిపాలిటీల వారీగా సమన్వయకర్తల జాబితా**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 24:** తెలంగాణలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల కోసం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జ్‌లను నియమించింది. ఈ మేరకు కార్పొరేషన్లు, మున్సిపాలిటీల వారీగా సమన్వయకర్తల జాబితాను శనివారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్ బాధ్యతలను ఒక సీనియర్ నాయకుడికి అప్పగించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసే వరకు వీరు నిరంతరం స్థానిక నాయకత్వానికి, కేడర్‌కు అందుబాటులో ఉంటారని కేటీఆర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎన్నికల వ్యూహాలను రూపొందించడం ఇన్‌ఛార్జ్‌ల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ఇన్‌ఛార్జ్‌లది కీలక పాత్ర అని ఆయన తెలిపారు.

స్థానిక నాయకత్వంతో చర్చించి,అందరినీ సమన్వయపరిచి గెలుపు గుర్రాలకు సంబంధించిన నివేదికను పార్టీ అధిష్ఠానానికి వారు సమర్పిస్తారని అన్నారు. పార్టీ ప్రచార కార్యక్రమాలను ఇన్‌ఛార్జ్‌లు ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకువెళ్లాలని సూచించారు. ఎన్నికల సరళి, క్షేత్రస్థాయి పరిశీలన, కార్పొరేషన్, మున్సిపాలిటీలలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదించేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ రూపొందించిన ప్రచార కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడం, బూత్ లెవల్ ఏజెంట్లను సమన్వయం చేయడం వంటి అంశాలను వీరు పర్యవేక్షిస్తారు.

ఎన్నికల సరళిని, గ్రౌండ్ రిపోర్టులను ఎప్పటికప్పుడు తెలంగాణ భవన్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయానికి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు నివేదించేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రజల మద్దతుతో మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని ఈ సందర్భంగా కెటిఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## అధికార, ప్రతిపక్షాలు కలిసి ఫోన్ ట్యాపింగ్ డ్రామా

**ప్రజలను తప్పదోవ పట్టించే రాజకీయ కుట్ర**

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జనవరి24:** ఫోన్ ట్యాపింగ్ అంశంపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ రాజ్యాంగ ఉల్లంఘన అని అన్నారు. ఈ కేసును కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి ఫోన్ ట్యాపింగ్ డ్రామాకు తెరలేపాయని విమర్శించారు.ఈ కేసులో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ కలిసి ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ కుట్రలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్‌తో నష్టపోయిన వారికి న్యాయం జరగాలంటే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ వేగవంతం కావాలని, బాధ్యులపై త్వరగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పార్టీ రాష్ట్ర కార్యాలయంలో భారతరత్న కర్పూరీ ఠాకూర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడారు. కర్పూరీ ఠాకూర్ బీహార్ రాష్ట్రానికి రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరి అభివృద్ధి కోసం ఆయన కృషి చేశారని పేర్కొన్నారు. ఉచిత విద్య, రిజర్వేషన్లు, రైతు సంక్షేమం వంటి అనేక సంస్కరణలను దశాబ్దాల క్రితమే అమలు చేసిన గొప్ప నాయకుడు అన్నారు. మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న పురస్కారం అందించిందని గుర్తుచేశారు.

## పాత అప్పుల కిస్తీలకు మళ్లీ కొత్త రుణాలు

**2064 నాటికి రూ.3.64 లక్షల కోట్లు చెల్లించాలి**

**రాష్ట్ర అప్పులపై రిజర్వ్ బ్యాంక్ వెల్లడి**

**హైదరాబాద్, జనవరి 24, ప్రభాతవార్త :** రాష్ట్రంలో గత పాత అప్పుల అసలు, వాటికయ్యే వడ్డీలను చెల్లించడానికి రాష్ట్ర సర్కార్ కొత్తగా మరిన్ని అప్పులు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో 2064 నాటికి తెలంగాణ ప్రభుత్వం అప్పుల అసలు కింద రూ.3,63,883 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇదే సమయంలో ఈ అప్పులతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం గతంలో దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న నేపథ్యంలో భవిష్యత్తులో తిరిగి చెల్లించాల్సిన అప్పుల మొత్తం గణనీయంగా పెరగనుంది. ఈ విషయాన్ని రిజర్వ్ బ్యాంక్ రూపొందించిన రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు, 2025-26 సంవత్సరపు బడ్జెట్‌లపై ఓ అధ్యయనం పేరిట తాజాగా రూపొందించిన నివేదికలో వెల్లడించింది. 2025-64 మధ్యలో అప్పుల అసలు సొమ్మె రూ.3,63,883 కోట్లు కట్టాల్సి ఉందని, వడ్డీలు దీనికి అదనమని ఆ నివేదికలో వెల్లడించింది. ఇక కొత్తగా చేస్తున్న రుణాల్లో అత్యధిక భాగం పాత రుణాల కిస్తీలు, వడ్డీలకు పోగా, రాష్ట్ర ప్రభుత్వం చేతికి అందుతున్నది చాలా తక్కువగా ఉంటోందని పేర్కొంది. గత మూడేళ్ల సగటును తీసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న బహిరంగ మార్కెట్ రుణాల్లో 58శాతం సొమ్ము పాత అప్పుల కిస్తీలు, వడ్డీల చెల్లింపుకే సరిపోయిందని తెలిపింది. మిగిలిన 42 శాతం సొమ్మును ప్రభుత్వం ఇతర వాటికి ఖర్చు చేసింది. ఈ నివేదిక ప్రకారం తెలంగాణ ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరంలో తెచ్చిన అప్పుల్లో 70 శాతం, 2024-25లో సేకరించిన అప్పుల్లో 56శాతం, 2025-26లో చేసిన అప్పుల్లో 49శాతం మేర సొమ్మును పాత అప్పులు, వడ్డీలు తిరిగి చెల్లించడానికే వినియోగించినట్లు తెలియచేసింది. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల పేరిట గ్యారంటీ అప్పులు చేసింది. 2025 మార్చి నాటికి సవరించిన అంచనాల ప్రకారం ఈ అప్పులు రూ.2,41,528 కోట్లకు చేరినట్లు రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. ఫలితంగా రాష్ట్ర స్థూల దేశీయోత్ప త్తి (జీఎస్‌డీపీ)లో రాష్ట్ర అప్పుల శాతం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేసింది. ఎఫ్ఆర్‌బీఎం చట్టం ప్రకారం రాష్ట్ర జీఎస్‌డీపీలో అప్పులు 25 శాతానికి మించకూడదని, కానీ ఆ పరిమితి దాటుతున్నాయని వివరించింది. 2021లో 28.8శాతం, 2022లో 28శాతానికి చేరాయి. 202526లో రాష్ట్ర బడ్జె ట్ అంచనాల ప్రకారం జీఎస్‌డీపీలో అప్పులు 27.5శాతం వరకు ఉంటాయని ఆర్బీఐ పేర్కొంది.

## ఉపాధ్యాయులే విద్యావిప్లవానికి కేంద్రం

**విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా**

**హైదరాబాద్, జనవరి 24, ప్రభాతవార్త :** ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీపై టిశాట్ ద్వారా రాష్ట్రస్థాయి ప్రత్యక్ష ప్యానెల్ చర్చ ఉపాధ్యాయులే విద్యా విప్లవానికి కేంద్రమని విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా అన్నారు. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) లక్ష్యాలను మరింత బలోపేతం చేయడంలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ(ఎఫ్ఎల్ఎస్)పై విస్తృత రాష్ట్రస్థాయి ప్యానెల్ చర్చను టిశాట్ ద్వారా శనివారం ప్రత్యక్ష ప్రసారంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా పాఠశాల విద్యాశాఖ డైరక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ ముఖ్య అతిథులుగా హాజరై.. రాష్ట్రవ్యాప్తంగా సమర్థవంతంగా ఫౌండేషనల్ లెర్నింగ్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్న మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్లతో కలిసి మూడవ తరగతి విద్యార్థుల అభ్యాస సిద్ధత, కార్యాచరణ ప్రణాళికలు, అమలు విధానాలపై సవివరంగా చర్చించారు.

ఈ చర్చలో రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, మండల, జిల్లా స్థాయి విద్యాధికారులు పాల్గొని ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ అమలులో తీసుకోవాల్సిన కార్యాచరణపై స్పష్టమైన అవగాహన పొందారు.ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా మాట్లాడుతూ.. ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ మూడు సంవత్సరాల విద్యా కృషికి ప్రతిబింబమని.. ఇది ఒక పరీక్ష కాదు- విద్యార్థి సామర్థ్యాల వికాసానికి దారి చూపే మార్గదర్శకమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్ మార్గదర్శకాలు, అసెస్మెంట్ విధానాలపై సంపూర్ణ అవగాహన కలిగి, కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రత్యేకంగా ప్రారంభ దశ విద్యలో ఫోనిక్స్ సౌండ్స్ ఆధారంగా పదాలు చదివే నైపుణ్యం ఉపాధ్యాయులకు అత్యంత కీలకమని, విద్యార్థుల అభ్యాస స్థాయిని గుర్తించేందుకు మాక్ టెస్టులు, టీచర్ సపోర్టెడ్ గ్రూపులు, పీర్ గ్రూపుల ద్వారా రెమిడియల్ బోధన నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. చదవడంలో ప్రావీణ్యం పెంపొందిం చేందుకు టైమర్ వినియోగం, నిర్ణీత సమయంలో చదివే పదాల సంఖ్య గుర్తించడం, పేరా చదివి అర్థం చేసుకుని ప్రశ్నలకు సమాధానాలు చెప్పే సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు.

చిత్రాల ఆధారంగా నేమింగ్ వర్డ్స్, యాక్షన్ వర్డ్స్‌తో పూర్తి వాక్య నిర్మాణం చేయించడం ద్వారా భాషా నైపుణ్యాలు మెరుగుపడతాయని తెలిపారు. ఎఫ్ఎల్ఎన్ ఒక కార్యక్రమం మాత్రమే కాదని..ఇది ఒక ఉద్యమమని పేర్కొంటూ, ఉపాధ్యాయులు పిల్లలలో ఆత్మవిశ్వాసం, స్వీయ నమ్మకాన్ని పెంపొందించే అనుభవాలను కల్పించాలన్నారు. గణిత బోధనలో లోకాస్ట్, నోకాస్ట్ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ వినియోగం అభ్యాసాన్ని మరింత ఆసక్తికరంగా మార్చుతుందని సూచించారు.పాఠశాల విద్యాశాఖ డైరక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ మాట్లాడుతూ.. 5+1 విధానంలో ఐదు రోజుల బోధన అనంతరం ఆరో రోజున వర్క్‌బుక్స్ ద్వారా విద్యార్థుల అభ్యాస స్థాయిని అంచనా వేయడం ద్వారా ఎఫ్ఎల్ఎన్ సామర్థ్యాలను బలోపేతం చేయవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడవ తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన ఐటెం బ్యాంకును ఉపాధ్యాయులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు అకాడమిక్ నాయకులుగా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలిపేలా ఉపాధ్యాయులను ప్రోత్సహించాలని కోరారు.

## 27 నుంచి సెట్స్ కమిటీల సమావేశం

**ఫిబ్రవరి 2 నుంచి నోటిఫికేషన్ల జారీ**

**హైదరాబాద్, జనవరి 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2026-27 విద్యా సంవత్సరంలో ఉన్నత విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ పరీక్షలకి సంబంధించిన సెట్స్ కమిటీ సమావేశాలు ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 27న ఈ సెట్‌తోపాటు లాసెట్ కమిటీల సమావేశాలు జరగనున్నాయి. ఆ తరువాత ఈ నెల 28, 29న ఇతర సెట్స్ కమిటీల మీటింగ్స్ జరగనుండగా.. ఈ నెల 30న ఎప్‌సెట్-2026 మీటింగ్ జరగనుంది. ఇక సెట్స్ కమిటీల సమావేశాలు ముగిసిన అనంతరం ఫిబ్రవరి 2 నుంచి వివిధ సెట్స్‌కి సంబంధించిన నోటిఫికేషన్లను, ఆయా సెట్స్ నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను జారీ చేయనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లకు సంబంధించిన తేదిలను తెలంగాణ ఉన్నత విద్యా మండలి తేదిలను ప్రకటించింది. రాష్ట్రంలో నిర్వహించే 8 కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్స్‌కి సంబంధించిన తేదిలను ఉన్నత విద్యా మండలి గత ఏడాది డిసెంబర్ 30న ప్రకటించింది. వివిధ జాతీయ ప్రవేశ పరీక్షలతోపాటు వివిధ పోటీ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ అనుమతితో కామన్ ఎంట్రెన్స్ పరీక్షల తేదిలను ఉన్నత విద్యా మండలి ప్రకటించింది.

